# రహదారి భూతాలు

## GHOST STORY

1935వ సంవత్సరం మే నెల.

రాయల్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన టి.ఇ. లారెన్స్ తన మోటార్ సైకిల్ మీద వేగంగా దూసుకుపోతున్నాడు. అతడికి నలభై ఆరు సంవత్సరాల వయసుంటుంది. అర్జెంటు పనిమీద తన 'బ్రో సుపీరియర్' మోటార్ సైకిల్ మీద కంటోన్మెంట్ వైపుకు శరవేగంతో ప్రయాణిస్తున్నాడు. మోటారు సైకిల్ వేగాన్ని మించి అతడి మనస్సు రేసుగుర్రంలా పరుగులు తీస్తున్నది. అతడి ఆలోచనలన్నీ అతడు అందజేయవలసిన మెసేజిమీదే ఉంది. వెనకనుండి దూరంగా పోనిస్తున్నాడు. ఆలోచనల్లో నిమగ్నుడైన 'లారెన్స్' ముందుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించలేకపోయాడు. 'డార్ చెస్టర్'కు తొమ్మిది మైళ్ళ దూరంలో ఉన్న 'దాడ్డక్ క్రాసింగ్'ను మోటార్ సైకిల్ సమీపిస్తున్నది...

'ధన్' మంటూ పెద్ద శబ్దంతో కారు, మోటారు సైకిల్‌ను వెనకనుండి గుద్దింది. ఆ దెబ్బకు లారెన్స్ గాలిలోకి బంతిలా లేచి, పల్టీలు కొట్టుకుంటూ రోడ్డుమీద పడిపోయాడు. అతడి కపాలం బద్దలై మెదడు బయటకు వచ్చింది. రక్తం మడుగులో అతడు దారుణంగా మరణించాడు. మోటార్ సైకిల్, కారు చక్రాల కింద నలిగిపోయి రేకుల కుప్పగా మారింది.

ఈ సంఘటన జరిగిన కొద్ది రోజులకు...

'డార్ చెస్టర్'కు వెళ్ళే రహదారి మీద వాహనాలు ప్రయాణిస్తున్నాయి. పాదచారులు గుంపులు గుంపులుగా నడుస్తున్నారు. హఠాత్తుగా పరిసరాలు కంపించిపోయే ధ్వనితో దూసుకువస్తున్న మోటార్ సైకిల్ శబ్దం వినిపించింది. ఆ ధ్వని తీవ్రతకు, మోటార్ సైకిల్ మీదకు వచ్చేస్తుందన్న భయంతో పాదచారులు పక్కకు తప్పుకున్నారు. కీచుమన్న శబ్దంతో కొన్ని వాహనాలకు సడన్ బ్రేక్‌లు పడ్డాయి. కాని ఆశ్చర్యంగా



వాళ్ళెవరికి మోటార్ సైకిల్ కనిపించలేదు. కొంతమందికి మోటార్ సైకిల్ శబ్దంతోపాటు పొగ మంచులాగా వాళ్ళ మీద నిర్వీకృత్యమయ్యింది. చాలామంది ప్రజలకు మోటారు సైకిల్ కనిపించక పోయినా, అది వారి సమీపంలోనే ఆగినట్లు అనుభూతి కలిగింది. ఈ విధంగా 1955వ సంవత్సరం వరకు దాదాపు ఇరవై సంవత్సరాలపాటు లారెన్స్ భూతం అప్పుడప్పుడు ప్రజలకు కనిపించేది. ప్రస్తుతం లారెన్స్ భూతం కనిపించటం లేదు కాని మోటారు సైకిల్ శబ్దం మటుకు వినిపిస్తూనే ఉంది...

1930వ సంవత్సరం...

లండన్‌కు చెందిన కెన్సింగ్టన్, ఏరియాలోని సెయింట్ మార్క్స్ రోడ్... ఈ రోడ్డు 'కేంబ్రిడ్జి గార్డెన్' వైపుకు తిరిగే మలుపు ఎంతో వాలుగా ఉంటుంది. అర్ధరాత్రి సమయం అవుతున్నది... కేంబ్రిడ్జి గార్డెన్ వైపుకు వెళుతున్న అసంఖ్యాకమైన వాహనాలు, హెడ్‌లైట్ల వెలుతురులో దూసుకుపోతున్నాయి. వాహనాలు మలుపు తిరుగుతుండగా, సడన్‌గా ఎదురుగా రోడ్డు మధ్యలో ఎర్రటి డబుల్ డెక్కర్ బస్ ప్రత్యక్షమయింది. బస్సంతా ఖాళీగా వుంది. రోడ్డంతటిని ఆక్రమిస్తున్న ఆ బస్సును గుద్దుకోకుండా ఎలా తప్పించాలో చాలా మంది డ్రైవర్లకు అర్థం కాలేదు. కొంతమంది సడన్ బ్రేకులు వేశారు. మరి కొందరు స్టీరింగ్‌ను పక్కకు కోశారు. కొద్ది నిమిషాల్లోనే ఆ ప్రదేశమంతా 'ధన్ ధన్' మన్న శబ్దాలతో మార్మోగిపోయింది. చాలా కార్లు ఒకదాన్నొకటి గుద్దుకొని డ్రైవర్స్ చాలా మంది మరణించారు. పెట్రోలు టాంకులు అంటుకొని కొన్ని కార్లు మండటం మొదలుపెట్టాయి. ఈ బస్సు తరచుగా అర్ధరాత్రి సమయంలో ప్రత్యక్షమవటం మూలంగా, ఆ ప్రదేశంలో కొన్ని వందల వాహనాలు ప్రమాదానికి గురి అయ్యాయి. ఈ సంఘటనలమీద జరిగిన పరిశోధనలో అది ఘోస్టు బస్సు అని నిర్ధారణ అయింది. చివరకు ఆ ప్రదేశం టచ్ కాకుండా హైవే రూట్‌ను మార్చిన తరువాత భూతాల బస్సు కనబడటం మానేసింది...

1915వ సంవత్సరం...

'నార్తాంప్టన్ షైర్', 'హార్బర్'ల మధ్య ఉన్న రోడ్డుమీద సైకిల్ వేగంగా వెళుతున్నది. సైకిల్ తొక్కే వ్యక్తి ఉల్లాసంగా కూనిరాగాలు తీస్తున్నాడు. అతడి ఉల్లాసానికి తగ్గట్టు వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. పొంచి ఉన్న మృత్యుదేవతలా అతడికి ఎదురు దిశలో ఒక కారు వేగంగా వస్తున్నది. కారు వేగాన్ని గుర్తించిన సైకిల్ వ్యక్తి, సైకిల్‌ను పక్కకు తప్పించటానికి ప్రయత్నం చేసాడు కాని అప్పటికే సమయం మించిపోయింది. కారు చక్రాలు నిర్దాక్షిణ్యంగా అతడి శరీరం మీదకు ఎక్కి రక్తం వెల్లువలై పారింది. అతడి తల తెగిపోయి రోడ్డుమీద కొద్ది దూరంవరకు దొర్లుకుంటూ పోయింది. ప్రమాద స్థలానికి వచ్చిన పోలీసులు అతడే ప్రాంతానికి చెందినవాడో నిర్ధారించలేక పొయ్యారు.

మరునాడు...

అదే రోడ్డుమీద వాహనాలు యధాతదంగా వెళుతున్నాయి. హఠాత్తుగా తల లేని మొండెం ఒకటి సైకిల్ తొక్కుకుంటూ కార్లముందు ప్రత్యక్షమయింది. ఆ భయంకర దృశ్యాన్ని చూడగానే చాలామంది డ్రైవర్లు భయంతో తాత్కాలికంగా ఉన్మాదులైపోయారు. అదుపు తప్పిన కార్లు ప్రమాదానికి గురై ఎంతోమంది మరణించారు. కారు ప్రమాదంలో మరణించిన సైకిల్ వ్యక్తి భూతం, ఈ రకంగా కారు డ్రైవర్ల మీద పగ తీర్చుకోవటం మొదలుపెట్టింది.

'బ్రాంబర్' నుండి 'ససెక్స్' వైపుకు వెళ్ళే రోడ్డుమీద భూతాల పిల్లలు కార్లవెంట పరుగెత్తేవారు. ఎవరైనా వాటితో మాట్లాడాలని ప్రయత్నిస్తే వెంటనే పిల్లభూతాలు మాయమైపోయేవి....

నేషనల్ హైవే నె. ఎ–12 మీద, ఉత్తరాల సంచి తగిలించుకొని ఒక పోస్ట్‌మేన్ భూతం కనిపిస్తుండేది. ఈ భూతం యార్‌మౌత్, నార్‌ఫోక్, సఫోక్ ప్రాంతాలలో తిరుగుతుండేది. ఈ భూతం గురించి పరిశోధించగా, 1899 సంవత్సరంలో 'విలియం వాల్' అనే పోస్ట్‌మేన్ మంచుమూలంగా కళ్ళు కనబడక ట్రక్ కిందబడి మరణించి భూతంగా మారాడని తేలింది. చనిపోయే సమయంలో అతడు తపాలా బట్వాడా చేసి వస్తున్నాడు. ●

— మహావాది హనుమంతరాయలు

## పచ్చి అబద్ధం

నేను ఎయిర్ ఇండియాలో ఓ చిన్న వుద్యోగం చేసేవాడ్ని. ఆ మాట నిజమే! కానీ, నేను అండర్ వరల్డ్ సంస్థ అయిన మాఫియాకి ఏ విధంగాను సాయం చేయలేదు. నేను సినిమా నిర్మాతనవడంలో మాఫియా నాయకుల ఆర్థిక సహాయం, అండదండలు వున్నాయన్నది పచ్చి అబద్ధం — సుధాకర్ బొకాడే!



